
Toli Velugu 20.01.26_Layout 1 1/20/2026 6:23 AM Page 1

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



అహంకారము
గర్వమును
విడిచిపెట్టిన వానికే
దైవదర్శనము
కలుగుతుంది.
- రామకృష్ణ పరమహంస

నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 12 | పేజీలు : 5 | మంగళవారం | 20 జనవరి 2026 | వెల : 2/-

# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు

## - రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్, జనవరి 19 (తొలివెలుగు): రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇవి:

1. మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం

రాష్ట్రంలో పదవీకాలం ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలోని 2,996 వార్డులు, డివిజన్లకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయినందున, ఫిబ్రవరిలోనే ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించింది. ఫిబ్రవరిలో రంజాన్, శివరాత్రి పండుగలు ఉన్నందున ఎన్నికల ప్రక్రియకు ఇబ్బంది కలగకుండా షెడ్యూల్ రూపొందించాలని అధికారులను ఆదేశించింది.

2. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు

2027 జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించనున్న నేపథ్యంలో, బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రధాన, పురాతన

2




### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..
## హరీశ్ రావుకు నోటీసులు

- మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు
- జూబ్లీహిల్స్ లోని పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరు కావాలన్న సిట్
- ప్రస్తుతం సిద్దిపేట పర్యటనలో ఉన్న హరీశ్ రావు



డెస్క్, జనవరి 19 (తొలివెలుగు) : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి, బీఆరచవతీతీచస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తునకు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు (మంగళవారం) ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరు కావాలని సిట్ హరీశ్ రావుకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొంది. మాజీ మంత్రి ప్రస్తుతం సిద్దిపేట పర్యటనలో ఉన్నారు. ఆయన ఇంట్లో లేని సమయంలో సిట్ ఈ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చిన దర్యాప్తు బృందం వారిని విచారించింది.

## హరీశ్ రావును ఎదుర్కోలేక కక్ష సాధింపు - సిట్ నోటీసులపై కేటీఆర్

- రాజకీయ వేధింపులే కాంగ్రెస్ ఏకైక అజెండాగా మారిపోయిందని విమర్శ
- ఫోన్ ట్యాపింగ్ కేసును సుప్రీం కోర్టు కొట్టి వేసిందని గుర్తు చేసిన కేటీఆర్
- హరీశ్ రావు నిలదీస్తున్నందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం



డెస్క్, జనవరి 19 (తొలివెలుగు) : ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడంపై బీఆరచవతీతీచస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. హరీశ్ రావును ఎదుర్కోలేక ఆయనపై తప్పుడు కేసులు పెట్టి నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాజకీయ వేధింపులే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండాగా మారిపోయిందని ఆయన విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యేనని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని, ఆ కేసును కొట్టివేసిందని ఆయన గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతోనే ఫోన్ ట్యాపింగ్ కేసు డ్రామా ముగిసిపోయిందని, అయినప్పటికీ మళ్లీ హరీశ్ రావుకు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ స్థాయికి...

☞ 2

## హైదరాబాద్‌లో 137 ప్లాట్లను వేలం వేయనున్న 'రాజీవ్ స్వగృహ'



- తొర్రూర్, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లిలో 137 ప్లాట్ల వేలం
- ఫిబ్రవరి 7, 8 తేదీల్లో వేలం వేయనున్నట్లు కార్పొరేషన్ ఎండీ వెల్లడి
- బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధర నిర్ణయం

2

## నీతులు చెప్పే డీజీపీ ఖాకీ బుక్ ఎక్కడకు వెళ్లింది? - హరీశ్ రావు

- ఖాకీ బుక్‌ను కాకి ఎత్తుకుపోయిందా? అన్న హరీశ్ రావు
- కాంగ్రెస్ నేతలపై వస్తున్న ఆరోపణలపై మౌనం వహిస్తున్నారని విమర్శ
- జర్నలిస్టులు, బీఆర్ఎస్ నేతలపై మాత్రం సిట్ లు వేస్తున్నారని మండిపాటు



డెస్క్, జనవరి 19(తొలివెలుగు) : కాంగ్రెస్ నేతలపై వస్తున్న ఆరోపణలపై పోలీసులు మౌనం పాటించడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్రంగా తప్పుబట్టారు. చట్టం అందరికీ సమానమని చెబుతూ నీతులు చెప్పే డీజీపీ శివధర్‌రెడ్డి ఖాకీ బుక్ ఇప్పుడు ఎక్కడికెళ్లిందని..

2

## బిల్లులు చెల్లించలేదని పాఠశాల గేటుకు తాళం!

- రూ. 23 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయన్న మాజీ సర్పంచ్

- పడిగాపులు కాసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

- జిల్లా విద్యాధికారి చొరవతో తాళం తొలగింపు






వివరాలు 2 లో..

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

- మంగళవారం ఉదయం పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నబీన్
- జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో అనివార్యమైన ఎన్నిక
- గత ఏడాది డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం



డెస్క్, జనవరి 19 (తొలివెలుగు) : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## 2,500 మందితో 'వందేమాతరం' ప్రదర్శన

### - కీరవాణిని అభినందించిన బండి సంజయ్



- వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రిపబ్లిక్ డే పరేడ్ ప్రత్యేక ప్రదర్శన
- సంగీతం అందిస్తున్న ఎం.ఎం. కీరవాణి
- దేశవ్యాప్తంగా 2500 మంది కళాకారులతో భారీ కార్యక్రమం
- కీరవాణి కృషిని కొనియాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహణ

☞ 2

## తిరుమలలో రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు



- ఈ నెల 25న రథసప్తమి
- సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలు
- ఏడు వేర్వేరు వాహనాలపై విహరించనున్న వేంకటేశ్వర స్వామి

☞ 2

Toli Velugu 20.01.26_Layout 1 1/20/2026 6:23 AM Page 2



# పునరుద్ధరణ పూర్తి





డెస్క్, జనవరి 19 (తొలివెలుగు): ఆదివాసీల అతిపెద్ద పండుగ అయిన మేడారం సమ్మక్క - సారలమ్మ పుణ్యక్షేత్రం పునరుద్ధరణ పూర్తయిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో ముఖ్యమంత్రి కుటుంబ సమేతంగా సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. దాదాపు వెయ్యేళ్ల వీరగాథకు, జాతి వారసత్వ సంపదకు సంబంధించిన చరిత్రకు అద్దం పట్టేలా రూపుదిద్దుకున్న మేడారం గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని పునఃప్రారంభించిన అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు పైలాన్‌ను ఆవిష్కరించారు.

## హైదరాబాద్‌లో 137 ప్లాట్లను వేలం వేయనున్న 'రాజీవ్ స్వగృహ'

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 19 (తొలివెలుగు) : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లాలోని తొర్రూర్ (105 ప్లాట్లు), కుర్మల్‌గూడ (20 ప్లాట్లు), మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బహదూర్‌పల్లిలో (12 ప్లాట్లు) గల మొత్తం 137 ప్లాట్లను వేలం వేయనున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో వేలం ప్రక్రియ ఉంటుందని ఆయన వెల్లడించారు. బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువగా, చదరపు గజానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల మధ్య ధరలను నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల కొనుగోలుదారులు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగమే ఈ ప్లాట్లను అభివృద్ధి చేయడం వల్ల కొనుగోలుకు మంచి డిమాండ్ ఉంటుందని ఆయన అన్నారు. ఈ వేలం ప్రక్రియ మరియు ప్లాట్ల వివరాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను (https:// Zwww.swagruha.telangana.gov.in/ais/) సందర్శించవచ్చని ఆయన తెలిపారు.

## హరీశ్ రావును ఎదుర్కోలేక కక్ష సాధింపు - సిట్ నోటీసులపై కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..
దిగజారిందో అర్థమవుతోందని ఆయన మండిపడ్డారు. రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే, దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించే 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. హరీశ్ రావు తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజల కష్టాల్లో తోడున్న నాయకుడని ఆయన కొనియాడారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడటంలో కానీ ఆయన చూపిస్తున్న చొరవను చూసి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని ఆయన అన్నారు. అందుకే రాజకీయంగా ఎదుర్కోలేక, ఇలాంటి తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని అన్నారు. గత 24 నెలలుగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఈ దారుణమైన పాలనను నిలదీస్తున్నందుకే హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తమకు చట్టంపై, న్యాయస్థానాలపై పూర్తి గౌరవం ఉందని, అందుకే ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. కానీ విచారణల పేరుతో, నోటీసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని భావిస్తే అది భ్రమే అవుతుందని అన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని వేధింపులకు గురిచేసినా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని, అడుగడుగునా ప్రశ్నిస్తుంటామని అన్నారు. ఇలాంటి చౌకబారు బెదిరింపులకు తమ పార్టీ భయపడదని ఆయన స్పష్టం చేశారు.

## తిరుమలలో రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 19 (తొలివెలుగు) : తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక రథసప్తమి ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల జీవకోటికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఒకే రోజులో స్వామివారు ఏడు వేర్వేరు వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన ప్రత్యేకత. అందుకే రథసప్తమిని 'అర్ధ బ్రహ్మోత్సవం'గా కూడా పిలుస్తారు. ఉత్సవాలు తెల్లవారుజామున సూర్యోదయ వేళ సూర్యప్రభ వాహన సేవతో ప్రారంభమవుతాయి. అనంతరం చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం మీద స్వామివారు వరుసగా భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవతో ఈ మహోత్సవం ఘనంగా ముగుస్తుంది. ఒక్కరోజులోనే స్వామివారి ఏడు వాహన సేవలను దర్శించుకునే అరుదైన అవకాశం లభించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు తిరుమలకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్శన క్యూలైన్లను సక్రమంగా నిర్వహించడం, తాగునీటి సరఫరా, అన్నప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రథసప్తమి వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు

### - రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటిపేజీ తరువాయి..
ఆలయాల అభివృద్ధి, ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బాసరఉభద్రాచలం మధ్య ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించింది. దేవాదాయ, రెవెన్యూ, అటవీ, పర్యాటక, పురాతత్వ శాఖలు సంయుక్తంగా డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించాలని, మార్చి 31 నాటికి సమగ్ర ప్రణాళికను సమర్పించాలని సీఎం ఆదేశించారు.

3. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్
హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ఉ× ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే ప్రక్రియలో ఇప్పటివరకు జరిగిన పురోగతిని కేబినెట్ సమీక్షించింది. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించింది.
మెట్రో ఫేజ్ఉఐఐఏ లో నాలుగు కారిడార్లు, ఫేజ్ఉ ఐఐబీ లో మూడు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నందున, ఈలోగా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. రూ.2,787 కోట్ల అంచనా వ్యయంతో భూసేకరణ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

4. విశ్వవిద్యాలయాల్లో పోస్టుల మంజూరు
నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ యూనివర్సిటీ లా కాలేజీలో 24 కొత్త పోస్టులు, ఫార్మసీ కాలేజీలో 28 కొత్త పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో రిజిస్ట్రార్ పోస్టు భర్తీకి అనుమతి ఇచ్చింది.


5. ఎకో టౌన్ డెవలప్మెంట్
హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్ మండలంలో ఎకో టౌన్ అభివృద్ధి కోసం ౧+××జ కు 494 ఎకరాల భూమి కేటాయించేందుకు కేబినెట్ అనుమతి ఇచ్చింది.

6. హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యల పరిష్కారం
హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు బంజారాహిల్స్‌లోని ఐసిసిసి నుంచి శిల్పా లేఔట్ రోడ్డు వరకు సుమారు 9 కిలోమీటర్ల కొత్త రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

7. పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్
ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. రామప్ప చెరువు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెరువులు, కుంటలను నింపడంతో పాటు 7,500 ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించనుంది. ఈ ప్రాజెక్ట్‌ను రూ.143 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు.

## 2,500 మందితో 'వందేమాతరం' ప్రదర్శన

### - కీరవాణిని అభినందించిన బండి సంజయ్




మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవారి 19 (తొలివెలుగు) : ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కీరవాణి స్వరాలు సమకూర్చడం ఒక చరిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2,500 మంది కళాకారులతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడం నిజంగా అద్భుతమని బండి సంజయ్ కొనియాడారు. సంగీతం, జాతీయ స్ఫూర్తి, ప్రతిష్ఠ అన్నీ కలగలిసిన ఈ కార్యక్రమం దేశానికి ఒక చారిత్రక నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగంగా, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రదర్శన జరగనుంది. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చిన 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననుండగా, దీనికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు. ఈ అరుదైన అవకాశంపై కీరవాణి కూడా స్పందించారు. "వందేమాతరం! చరిత్రాత్మక గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా, జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు సంగీతం సమకూర్చే గౌరవం నాకు దక్కింది. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశ స్ఫూర్తిని చాటే ఈ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలి" అని ఆయన తన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ అపురూప ఘట్టం కోసం దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## బిల్లులు చెల్లించలేదని పాఠశాల గేటుకు తాళం!

మొదటిపేజీ తరువాయి..
వలిగొండ, జనవరి 19 (తొలివెలుగు) : 'మన ఊరు - మన బడి' పథకం కింద చేపట్టిన పాఠశాల నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించలేదని ఆరోపిస్తూ సంగెం గ్రామ మాజీ సర్పంచ్ సోమవారం పాఠశాల ప్రధాన గేటుకు తాళం వేసిన ఘటన వలిగొండ మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వలిగొండ మండలం సంగెం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.28 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కీసర్ల రామ్ రెడ్డి చేపట్టారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.28 లక్షల బిల్లులను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు. అయితే ఇప్పటివరకు కేవలం రూ.5 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని, మిగిలిన రూ.23 లక్షలు ఇంకా అందలేదని పేర్కొంటూ నిరసనగా పాఠశాల గేటుకు తాళం వేశారు. ఇప్పటికే తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొందని మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు బయటే నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాధికారికి తెలియజేశారు. జిల్లా విద్యాధికారి వెంటనే మాజీ సర్పంచ్ రామ్ రెడ్డితో మాట్లాడి, త్వరలోనే బిల్లులు మంజూరు అవుతాయని హామీ ఇచ్చారు. ఆయన చొరవతో స్పందించిన మాజీ సర్పంచ్ పాఠశాల గేటుకు వేసిన తాళాన్ని తొలగించారు. దీంతో పాఠశాల



కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి.

## నీతులు చెప్పే డీజీపీ ఖాకీ బుక్ ఎక్కడకు వెళ్లింది? - హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 19 (తొలివెలుగు) ఎద్దేవా చేశారు. "ఖాకీ బుక్‌ను కాకి ఎత్తుకుపోయిందా?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలంపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన ఏఐసీసీ నేత, ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కాంట్రాక్టర్లను రూ.8 కోట్లు ఇవ్వాలని బెదిరించాడని ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్వయంగా బాధిత కాంట్రాక్టరే ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసులో సిట్ ఎందుకు వేయలేదని నిలదీశారు. జర్నలిస్టులు, బీఆర్ఎస్ నేతలపై మాత్రం సిట్‌లు, కమిషన్లు వేస్తారని, కాంగ్రెస్ నేతల విషయంలో ఎందుకు నిబంధనలు మారతాయని హరీశ్‌రావు మండిపడ్డారు. జర్నలిస్టుల కేసులో సిట్ ఏర్పాటు సీఎం రేవంత్ రెడ్డికి తెలియదని చెబుతున్నారని, అదే నిజమైతే ఆయన ముఖ్యమంత్రిగా పూర్తిగా



విఫలమైనట్టే అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పరిపాలన బాధ్యత వహించే సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్టాన్ని రాజకీయాల కోసం వాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీశ్‌రావు హెచ్చరించారు.

Toli Velugu 20.01.26_Layout 1 1/20/2026 6:23 AM Page 3



# బరిలో యువత..
## టికెట్ కోసం శివగౌడ్ దరఖాస్తు
### - 20వ వార్డు నుంచి పోటీకి ఆసక్తి



చౌటుప్పల్, జనవరి 19 (తొలివెలుగు) : మున్సిపల్ ఎన్నికల్లో చౌటుప్పల్ 20వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని ఎన్ఎస్‌యూఐ నాయకుడు పోతగాని శివ గౌడ్ కోరారు. సోమవారం లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి ఈ మేరకు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా శివ గౌడ్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేయాలని, తద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవుల రాజు యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# టీజీ ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పైళ్ల ప్రకాశ్ రెడ్డి ఎన్నిక

వలిగొండ, జనవరి 19 (తొలివెలుగు) : తెలంగాణ గురుకుల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా వలిగొండ పట్టణానికి చెందిన పైళ్ల ప్రకాశ్ రెడ్డి ఎన్నికయ్యారు. గురుకుల విద్యా వ్యవస్థపై ఆయనకు ఉన్న లోతైన అవగాహనతో పాటు, గతంలో వివిధ స్థాయిల్లో అందించిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు సంఘ నాయకులు తెలిపారు. ప్రిన్సిపల్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, గురుకుల విద్యా ప్రమాణాల అభివృద్ధికి పైళ్ల ప్రకాశ్ రెడ్డి నిరంతరం కృషి చేస్తారని పలువురు విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన నియామకంతో సంఘ కార్యకలాపాలకు మరింత బలమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వలిగొండ గ్రామానికి చెందిన విద్యా అభిమానులు, మిత్రులు కాసుల వెంకన్న, పబ్బు వెంకటరమణ, గరిసె రవి, పాలకూర వెంకటేశం, గంగాధర్ దయాకర్, నూతనగంటి వెంకటేశం, బెలిదే శ్రీనివాస్ తదితరులు పైళ్ల ప్రకాశ్ రెడ్డిని కలిసి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్రే కీలకం

- పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి
- సర్పంచులు బాగా పనిచేస్తేనే గ్రామాలకు పేరు
- శిక్షణా తరగతుల్లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు

పోచంపల్లి, జనవరి 19 (తొలివెలుగు) : గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని స్వామి రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు గ్రామ పంచాయతీ పాలన, విధులు, అభివృద్ధి అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ కిషోర్ రెడ్డి, డైరెక్టర్ విహారి, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఎంఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్‌లు సమర్థవంతంగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టం కింద సర్పంచ్‌లకు కల్పించిన అధికారాలు, విధులు తదితర అంశాలను శిక్షణలో భాగంగా క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడడం వంటి ప్రధాన అంశాల్లో సర్పంచ్‌లు చురుకుగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ఆదర్శ గ్రామపంచాయతీల నిర్మాణం వంటి అంశాలపై సర్పంచ్‌లకు ఈ శిక్షణ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, మోరల్ స్కిల్స్ వంటి అంశాలపై కూడా సర్పంచ్‌లు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీఓలు, నూతన సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.







# శివాలయంలో షెడ్డు నిర్మాణానికి శ్రీకారం

- ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ఫౌండేషన్ చేయూత
- మోక్ష లింగేశ్వర ఆలయంలో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన
- ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్





చౌటుప్పల్, జనవరి 19 (తొలివెలుగు) : ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంస్థ డైరెక్టర్ ఇరుగదిండ్ల అశోక్ అన్నారు. సోమవారం చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో ఉన్న మోక్ష లింగేశ్వర స్వామి శివాలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భక్తుల సౌకర్యార్థం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న షెడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ఇఎల్‌వి ఫౌండేషన్ ఆధ్యాత్మిక రంగంతో పాటు విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో కూడా పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకొని దైవ కార్యాల్లో భాగస్వాములు కావాలని కోరారు. దైవ సేవల్లో పాల్గొనడం ద్వారా లభించే తృప్తి మరెక్కడా దొరకదని ఆయన పేర్కొన్నారు. అడగగానే స్పందించి షెడ్డు నిర్మాణానికి ముందుకొచ్చిన ఫౌండేషన్ ప్రతినిధులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

# లౌకిక శక్తులతో కలిసే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ
## - ప్రశ్నించే గొంతుకలకు పట్టం కట్టాలి: సీపీఎం జిల్లా నేత ఎండి పాషా



చౌటుప్పల్, జనవరి 19 (తొలివెలుగు) : రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కలిసివచ్చే లౌకిక శక్తులతో కలిసి సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా స్పష్టం చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ కమిటీ కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో సీపీఎం ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే చౌటుప్పల్‌లో కనిపిస్తున్నాయని గుర్తు చేశారు. మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ మాట్లాడుతూ.. 20 వార్డుల్లోనూ పార్టీ శాఖలు బలంగా ఉన్నాయని, అవినీతి లేని పాలన అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారి రామేశ్వరి మాట్లాడుతూ.. గతంలో సీపీఎం సర్పంచ్‌గా జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన ఘనత తమ పార్టీదేనన్నారు. మున్సిపల్ కార్యదర్శి వర్గ సభ్యులు దండ అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీఎంపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు బండారు నరసింహ, సీపీఎం పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ గోపగోని లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు బత్తుల దాసు, రైతు సంఘం నాయకులు ఆకుల ధర్మయ్య, ఉష్కాగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Toli Velugu 20.01.26_Layout 1 1/20/2026 6:23 AM Page 4



# తీరిన నీటి కష్టాలు..

## - అండగా నిలిచిన ఇఎల్‌వి ఫౌండేషన్

- పేదల సేవకే ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ప్రాధాన్యం
- మల్లికార్జున నగర్‌లో బోరుబావి పనులు ప్రారంభం
- ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్



చౌటుప్పల్, జనవరి 19 (తొలివెలుగు) : పేద ప్రజల అవసరాలను గుర్తించి వారికి సహాయం అందించడమే ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఫౌండేషన్ డైరెక్టర్ ఇరగదిండ్ల అశోక్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీలో మందుల కుల సంక్షేమ సంఘం విన్నపం మేరకు సోమవారం బోరుబావి పనులను ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్ ఇఎల్‌వి భాస్కర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ అశోక్ పూజా కార్యక్రమాలు నిర్వహించి బోరు బావి తవ్వకాలకు శంకుస్థాపన చేశారు. కాలనీలో నెలకొన్న త్రాగునీటి సమస్యపై తక్షణమే స్పందించి బోరుబావి ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు ఊరట లభించింది. ఈ సందర్భంగా మందుల కుల సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న ఫౌండేషన్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అశోక్ మాట్లాడుతూ.. కాలనీ సమగ్ర అభివృద్ధికి భవిష్యత్తులో కూడా ఫౌండేషన్ తరపున తమ వంతు సహకారం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

# కొత్త బస్సు సర్వీసును ప్రారంభించాలి

## - నల్గొండ ఆర్.ఎమ్ కు సర్పంచుల విన్నపం



సంస్థాన్ నారాయణపురం, జనవరి 19 (తొలివెలుగు) : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం నుంచి కంకణాలగూడెం, శేరిగూడెం, చిమిర్యాల మీదుగా చౌటుప్పల్ వరకు కొత్త బస్సు సౌకర్యం కల్పించాలని నల్గొండ బస్సు డిపో ఆర్.ఎమ్ ను సర్పంచులు కోరారు. సోమవారం కంకణాలగూడెం సర్పంచ్ పాలెం వీరేష్ గౌడ్, చిమిర్యాల సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్ కలిసి ఆర్.ఎమ్, డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పై గ్రామాల ప్రజలు విద్య, ఉపాధి, వైద్య అవసరాల కోసం చౌటుప్పల్‌కు ప్రయాణించాల్సి వస్తోందని, సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ మార్గంలో బస్సు సర్వీసు ప్రారంభిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. వినతిని పరిశీలించిన ఆర్‌ఎం, డీఎం సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంకణాలగూడెం వార్డు మెంబర్ రాచకొండ గిరిబాబు, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్తల కిషన్, ముదుపు రంగారెడ్డి, చిమిర్యాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు వడ్డీ లేని రుణాలు

- ❖ కోటి మందిని కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ❖ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య
- ❖ చౌటుప్పల్ మున్సిపాలిటీలో రూ. 34 కోట్లకు పైగా రుణాల పంపిణీ
- ❖ స్వయం ఉపాధితోనే ఆర్థిక పురోగతి - కమిషనర్ వెంకట్రాంరెడ్డి





చౌటుప్పల్, జనవరి 19 (తొలివెలుగు) : మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య తెలిపారు. సోమవారం చౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో బి.ఆర్.కె ఫంక్షన్ హాల్‌లో స్వయం సహాయక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. గత రెండేళ్లలో 591 సంఘాలకు రూ.1.28 కోట్ల వడ్డీ లేని రుణాలు, 451 సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.33.25 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ నిధులతో మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్.ఓ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచులు, ఉప సర్పంచులకు ఘన సన్మానం

## - గ్రామాల అభివృద్ధికి బాధ్యతాయుతంగా పనిచేయాలి - మండల అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్




చౌటుప్పల్, జనవరి 19 (తొలివెలుగు) చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని బీఆర్‌ఎస్ మండల పార్టీ కార్యాలయంలో సోమవారం నూతనంగా ఎన్నికైన బీఆర్‌ఎస్ పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచులు, ఉప సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, సమర్థవంతంగా పనిచేస్తే భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అందుబాటులోకి వస్తాయని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమానికి సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, జిల్లా రైతు నాయకులు ముప్పిడి పురుషోత్తం గౌడ్, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి అల్మాస్ పేట కృష్ణ, ఉపాధ్యక్షులు చెన్నం బాలరాజు, మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తూడురి శిరీష పరమేష్ గౌడ్, నూతన సర్పంచులు సమిరెడ్డి భారతమ్మ జనార్దన్ రెడ్డి, సుర్వి మల్లేష్ గౌడ్, గుండెబోయిన శిరీష ఇస్తారి యాదవ్, అన్నాలవు నరేష్ ముదిరాజ్, కాకి శ్రీలత సుందర్, ఉప సర్పంచులు బోయిని లింగస్వామి యాదవ్, సురకంటి శ్రీధర్ రెడ్డి, కందగట్ల సురేందర్ రెడ్డి, కారంటోతు నర్సింహ్మ, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు, ఉపేందర్ గౌడ్, సాయికుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ పబ్బతి వెంకయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు పబ్బతి ఆంజనేయులు గౌడ్, కడగంచి చలమయ్య, ఇంద్రరాజు, బోరం ప్రకాష్ రెడ్డి తదితర కార్యకర్తలు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.



Toli Velugu 20.01.26_Layout 1 1/20/2026 6:23 AM Page 5



# జాతీయ స్థాయి క్రీడలకు పులిగిల్ల విద్యార్థి ఎంపిక

## - అభినందించిన ఉపాధ్యాయులు






వలిగొండ, జనవరి 19 (తొలివెలుగు) : తెలంగాణ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన 5వ సౌత్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా తరఫున పాల్గొన్న జడ్పీహెచ్ఎస్ పులిగిల్ల విద్యార్థి వరికుప్పల ఉదయ్ చరణ్ ఉత్తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికయ్యాడు. అదేవిధంగా ఫిబ్రవరి 7, 8 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా తిరుపతిలో జరగనున్న జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ఎం. మాధవి, ఏపీపీసీ ఛైర్మన్ అమృతమ్మ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో పాల్గొని ఉత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి పాఠశాలకే కాకుండా జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించా లని అభినందించారు. విద్యార్థి విజయంలో కీలక పాత్ర పోషించిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయు డు డా. మహేష్ బోనాలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా య బృందం, షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోత్కూర్ యాదయ్య తదితరులు ఉదయ్ చరణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పాతికేళ్ల విరామం.. చెరగని స్నేహం!

- ఘనంగా జెడ్పీహెచ్ఎస్ చౌటుప్పల్ 1999-2000 బ్యాచ్ సమ్మేళనం
- గురువులకు ఘన సన్మానం



చౌటుప్పల్, జనవరి 19 (తొలివెలుగు) : పాతికేళ్ల నాటి జ్ఞాపకాలు ఆ ప్రాంగణంలో మళ్లీ చిగురించాయి. చౌటుప్పల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదవ తరగతి 1999–2000 విద్యాసంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికంగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు బి. నర్సింహ రెడ్డి, ఎం. నర్సింహారావు, ఆర్. సతి రెడ్డి, ఎన్. కుమార స్వామి, కె. విజయలక్ష్మి, కె. రఘుమా రెడ్డి, టి. పాండు రంగ విట్టల్, పి. ప్రసాద్ రావు, టి. రామారావు, బి. ధనంజయయ్య హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. శిష్యులంతా కలిసి తమ గురువులను శాలువాలు, స్మారక చిహ్నాలతో ఘనంగా సన్మానించారు. మెండే మల్లేశం, బైరు నరేష్, సుర్వి సురేష్, కూరేళ్ళ పాండు, ఉడుగు కల్పన, అందె అరుణ, మరుపాక నీరజ, దొనూరి జ్యోతి, చెరుకు లింగమ్మ, రాచకొండ సంతోష తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ చిన్ననాటి ముచ్చట్లను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

# మేడారంలో మంత్రి సీతక్క మీడియా సమావేశం

## - గద్దెల ప్రాంగణ ప్రారంభం విజయవంతం



ములుగు జిల్లా/ మేడారం, జనవరి 19 (తొలివెలుగు) :
మేడారంలోని హరిత హోటల్‌లో మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మక్కఉ సారలమ్మ గద్దెల ప్రాంగణ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి గారి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. గద్దెల ప్రాంగణ ప్రారంభంతో ఒక కీలక ఘట్టం ముగిసిందని పేర్కొన్నారు. ఈ బుధవారం మండే మెలిగే పండుగ ఉన్న నేపథ్యంలో, మండే మెలిగే పండుగ నుంచి నిండు పండగ వరకు అన్ని కార్యక్రమాలు ఇదే విధంగా విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లుల కీర్తిని ప్రపంచానికి చాటేలా కార్యక్రమాలను విస్తృతంగా కవర్ చేసిన మీడియా సోదరులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మేడారంలో క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన అధికార యంత్రాంగానికి మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. సాధారణంగా హైదరాబాద్‌లో జరిగే క్యాబినెట్ సమావేశాన్ని అడవిలోకి తీసుకొచ్చి మేడారంలో నిర్వహించామని, కేవలం క్యాబినెట్ సమావేశమే కాకుండా ముఖ్యమంత్రి గారి కుటుంబం, మంత్రుల కుటుంబాలు కూడా ఇక్కడే బస చేసినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు యావత్ క్యాబినెట్ మేడారంలో ఉండి, ఇక్కడే క్యాబినెట్ సమావేశం నిర్వహించి పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రకటించడం ములుగు జిల్లాకు కారణమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికార యంత్రాంగానికి మరోసారి ఆమె అభినందనలు తెలిపారు. అటెండర్ నుంచి చీఫ్ సెక్రటరీ వరకు, హోంగార్డుల నుంచి డీజీపీ వరకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి క్యాబినెట్ సమావేశం, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేశారని పేర్కొంటూ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నిన్న క్యాబినెట్ సమావేశం, నేడు గద్దెల ప్రాంగణ ప్రారంభోత్సవం, సీఎంఉ మంత్రుల దర్శనాల సందర్భంగా ఎక్కడా చిన్న లోపం లేకుండా కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆమె అభినందించారు. స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలందరికీ మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. సమ్మక్కఉసారలమ్మ కీర్తి, స్ఫూర్తిని హృదయంలో నింపుకొని మహిళలు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారితో పాటు పెద్ద ఎత్తున మహిళలకు దర్శనాలు కల్పించినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలి

## – అదనపు కలెక్టర్‌కు మాల మహానాడు వినతి



వలిగొండ, జనవరి 19 (తొలివెలుగు) : ఈ నెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, వలిగొండ మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటం ఉండేలా స్పష్టమైన సూచనలు జారీ చేయాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. రాజ్యాంగ విలువలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఇది కీలకమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాశమల్ల శేఖర్, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, సంస్కృతిక కార్యదర్శి కూచిమల్ల కుమార్, వెలువర్తి గ్రామ అధ్యక్షులు కూచిమల్ల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు వలమల్ల రత్నయ్య, జక్క స్వామి, మద్దెల వెంకటేశం, బెల్లపు కృష్ణస్వామి పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు బహుమతులు అందజేసిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య



ములుగు జిల్లా , జనవరి 19 (తొలివెలుగు) : ములుగు మండలం కొత్తూరు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, గ్రామానికి చెందిన వీరమనేని నితిన్ రావు ఆధ్వర్యంలో యూత్ సభ్యులు నిర్వహించిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ టోర్నమెంట్‌లో విజయం సాధించిన గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామ జట్టుకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య బహుమతులు, ప్రైజ్ మనీ అందజేశారు. విజేత జట్టును ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంజా సూర్య మాట్లాడుతూ, ఆటలో గెలుపుఉఓటములు సహజమని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఓటమిని స్వీకరించి, తదుపరి మ్యాచ్‌లో విజయం సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగే వారే జీవితంలో గొప్ప స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. అల్లెం అప్పయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.